కథ

# మంచు ముద్ద

- కొమ్మూరి రవికిరణ్

**ఆగిన లిఫ్ట్ తలుపులు తెరుచుకోగానే బయటకు వచ్చాడు అనిల్. సాయంత్రపు ఎదురు ఎండ అతని కళ్ళల్లోకి కొట్టింది సూటిగా. వెంటనే ప్యాంటు జేబులోంచి కూలింగ్ గ్లాసెస్ తీసి పెట్టుకుని, కారు పార్కింగ్ ప్లేస్‌వైపు నడిచాడు. పార్కింగ్‌లో రెండు కార్లే వున్నాయి.**

**అనిల్ తన కారు దగ్గరకు వెళ్ళి డోర్ తెరిచి, భుజానికున్న ల్యాప్‌టాప్ బ్యాగు వెనుక సీట్లో పెట్టి స్టార్ట్ చేశాడు.**

**కారు అవుట్‌గేటు దగ్గరకు రాగానే, అక్కడ కూర్చున్న సెక్యూరిటీ పెద్ద యినుపగేటు ప్రక్కకు తోసి దారిచ్చాడు.**

**అనిల్ కారు ముందుకు పోనిచ్చి, రోడ్డుమీదకు వచ్చిన తర్వాత కారాపి బయటకు దిగి వెనక్కి తిరిగాడు.**

**అదొక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ. అందులోనే అనిల్ సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తను పని చేస్తున్న కంపెనీ బిల్డింగ్‌ని తదేకంగా చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు.**

**'ఇంకా తను ఎన్నాళ్ళు యీ కంపెనీలో పనిచేస్తాడో? నెలలా... రోజులా...? వైరాగ్యంగా అనుకున్నాడు.**

**అత్యంత అధునాతనంగా కట్టుబడి వున్న ఆ బిల్డింగ్‌ని ఒక్కసారి ఆపేక్షంగా చూసుకుని మళ్ళీ కారెక్కి స్టార్ట్ చేశాడు.**

దాదాపు ఆరేళ్ళుగా యిదే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు అనిల్. చాలామంది ఎక్స్‌పీరియన్స్‌తో హెచ్చుస్థాయి జీతాలకోసం కంపెనీలు మారినా, అతను మాత్రం మారడానికి యిష్టపడలేదు.

ఆరేళ్ళుగా అదే ఆఫీసు, అదే ఛాంబర్, అదే సిస్టమ్... అనుబంధం పెంచుకున్నాడు వాటిమీద.

ప్రకృతి వైపరీత్యం వల్ల అకస్మాత్తుగా వచ్చే భూకంపంలాగా, ఆర్థికమాంద్యం అనే భూకంపం వచ్చి తమ జీవితాల మీద నిర్దాక్షిణ్యంగా విరుచుకు పడింది.

ఆ భూకంపాల వల్ల వచ్చే నష్టాన్ని కాపాడ్డానికి ప్రభుత్వం వుంది, అనేక స్వచ్ఛంద సంస్థలున్నాయి. మరి... తమ జీవితాల మీద పడ్డ భూకంపం ప్రభావం నుండి ఎవరు కాపాడతారు?.. ఆ దేవుడే కాపాడాలి.

అతనికి దేవుడు గుర్తురాగానే యిల్లు గుర్తొచ్చింది. ఇల్లు గుర్తురాగానే భార్య సుమతి గుర్తొచ్చింది.

సుమతి... హు... ఉదాసీనంగా మారింది. అతని వదనం మనసంతా చేదుగా తయారయ్యింది. అతనికి తిన్నగా వెళ్ళాలనిపించలేదు.

వెడితే ఏముంటుంది? శూన్యం తప్ప.

ఇంతలో ఎవరో కారుకి అడ్డొస్తే హార్న్ నొక్కాడు.

ఒకసారి తను డ్రయివ్ చేస్తున్న కారును చూసుకున్నాడు. ఈ కారుతో కూడా ఎన్నాళ్ళో అటాచ్‌మెంట్స్?

వేలకు వేలు జీతాలొస్తున్నాయి కదా అని కమిట్‌మెంట్స్ పెంచుకున్నాడు. ఖరీదయిన కారు, మంచి ఏరియాలో ఫ్లాట్... ఒక్కసారిగా యివన్నీ పోతే తట్టుకోగలడా?

నుదుటి మీద ఏదో ప్రాకినట్లయ్యి తడిమి చూసుకున్నాడు. చెమట.. అంటే... తను టెన్షన్ ఫీలవుతున్నాడా? ఎందుకు టెన్షన్?.... తన సెంటిమెంట్సే తనకి శాపమా?

అతనికి కవిత మాటలు గుర్తొచ్చాయి "నీలాంటి సెంటిమెంటల్ ఫూల్‌ని నేనింతవరకు చూడలేదు అనిల్" అనేది.

ఉన్నట్టుండి మనసుకు బ్రేక్ పడినట్టుగా కారు కూడా ఆగిపోయింది.

అవునూ.. కవిత దగ్గరకెళ్తే...? చూసి నెలరోజులయిపోయింది. ఇప్పుడుంటుందా?

అతని చెయ్యి అప్రయత్నంగా సెల్‌ఫోన్ మీదకి వెళ్ళింది. కవితకి ఫోన్ చేశాడు. అట్నుంచి కవిత "హలో... బాస్?" ఆనందంగా వుంది ఆమె కంఠం.

"కవితా... ఫ్రీగానే వున్నానా? ఆఫీసులో వున్నావా?"

"ఇంట్లో వున్నాను.... ఏం వస్తావా?" సరదాగా అడిగింది.

"ఊ.... వద్దామనే అనుకుంటున్నాను. ఏమంటావ్?" సంకోచిస్తూ అడిగాడు అనిల్.

ఉత్సాహంగా అంది కవిత అట్నుంచి "పిచ్చి ప్రశ్న నువ్వు ఫోన్ చెయ్యడమే అదృష్టం. మా యింటికి వస్తానంటే మహాభాగ్యం. అయినా ఏమిటి కొత్తగా అడుగుతున్నావ్? ఎంతయినా పెళ్ళయిన తర్వాత మారిపోయావులే" వుడికిస్తున్నట్టుగా అంది.

ఆ మాటకు అతను అయిష్టంగా ముఖం పెట్టి "ప్చ్" అన్నాడు. అతను చిరాగ్గా వున్నాడని గ్రహించింది కవిత "సారీ... సారీ... యింట్లోనే వున్నాను... రా... రా..." అంది.

సెల్ ఆఫ్ చేసి, కారు కవిత వుండే ఏరియా వైపుకి తిప్పాడు. అనిల్‌కి, కవితకి దాదాపు పన్నెండేళ్ళ స్నేహం వుంది. ఇంజనీరింగ్ కూడా ఒకే కాలేజీలో చదివారు. తర్వాత యిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేశారు. కొంత కాలానికి కవిత వేరే కంపెనీలోకి మారింది. అనిల్ మాత్రం అక్కడే వుండిపోయాడు.

అనిల్ కారాపి కవిత వుండే అపార్ట్‌మెంటులోకి నడిచాడు. వాచ్‌మేన్ అనిల్‌ని చూసి అలవాటయిన వ్యక్తిలా నవ్వాడు.

అనిల్ మెట్లు మీద నడుచుకుంటూ, రెండవ అంతస్తులో వున్న ఆమె ఫ్లాట్ దగ్గరకెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కాడు.

వెంటనే తలుపు తెరుచుకుంది. "హమ్మయ్య వచ్చావా? వస్తానన్నావేగాని, మధ్యలో మూడ్ మార్చుకుని అటే వెళ్ళిపోతావనుకున్నాను... అలా... మనకలవాటేగా?"

అనిల్ ఆమెను నఖశిఖపర్యంతం చూశాడు. జీన్ ప్యాంటు, టీషర్ట్ వేసుకున్న తూనీగలా కనబడింది కవిత అతనికి.

"ఏమిటలా చూస్తున్నావు?"

నీరసంగా నవ్వి సోఫాలో కూర్చుంటూ

‘‘ఎప్పుడో ఒకసారి అలా చేశానని ఎప్పుడూ చేస్తానా?’’ అన్నాడు.

అతని ముఖకవళికల్ని గమనిస్తూ, దాదాపు అతన్ని ఆనుకుని కూర్చుని ‘‘ఏమిటలా వున్నావ్?’’ అంది కొంచెం ఆదుర్దాతో

ఆమె అలా కూర్చోగానే కంగారుపడి ‘‘ఆంటీ లేరా?’’ అన్నాడు దిక్కులు చూస్తూ

‘‘అమ్మ వూరెళ్ళింది కాని, ఎందుకలా వున్నావు?’’

‘‘ఆఫీసులో మీటింగ్ పెట్టారు?’’

‘‘ఏమైంది?’’

ఆమె వుద్దేశ్యం అర్థమయ్యి చిన్నగా నవ్వాడు ‘‘నా ఉద్యోగం తాత్కాలింగా సేఫ్ . నా క్రింద జూనియర్స్‌కి మాత్రం ఒకేసారి నలుగురికి ఉద్వాసన చెప్పాడు’’

‘‘మా కంపెనీలో కూడా అదే పరిస్థితి. ఎప్పుడేం జరుగుతుందోనని అందరూ భయంగా టెన్షన్‌గా వున్నారు’’

‘‘మరి నీకు లేదా టెన్షన్?’’ ఒకింత ఆశ్చర్యంగా అడిగాడు.

నవ్వింది కవిత ‘‘ఎందుకుండదూ? కనీసం నీకు చెప్పుకోవడానికి, నీ బాధల్ని పంచుకోడానికి నీ భార్య వుంది. నాకెవరున్నారు? ఒంటరిదాన్ని. అమ్మ వున్నా తనకి అర్థం కావు యిలాంటి విషయాలు’’

భార్య ప్రసక్తి రాగానే మ్లానమైంది అనిల్ ముఖం. అలాగే సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

‘‘ఏమైంది అనిల్?’’ అంది అనునయంగా అతని చేతిలో చెయ్యి వేసి.

ఆమె చేతినుండి మృదువుగా చేయి వెనక్కి తీసుకుని ముఖం ప్రక్కకి తిప్పుకున్నాడు.

వదల్లేదు కవిత. మళ్ళీ అతని చేతిని బలవంతంగా తనరెండు చేతుల్లోకి తీసుకుని నిమురుతూ అడిగింది ‘‘ఏం... సుమతి వూళ్ళో లేదా?’’

కళ్ళు చిట్లించి ‘‘వుంది’’ అన్నాడు.

‘‘మరెందుకు డల్‌గా వున్నావు?’’ కవితకి అనిల్ భార్య సుమతితో కూడా బాగానే పరిచయం వుంది.

‘‘ఏం లేదులే’’ అని లేవబోయాడు.


కవిత వెంటనే లేచి, అతని భుజాల మీద చెయ్యి వేసి బలవంతంగా కూర్చోబెట్టింది.

అనిల్ ఏం మాట్లాడక కళ్ళు మూసుకున్నాడు.

అతన్ని అలాగే వదిలేసి లోపలికి వెళ్ళి కాఫీ తీసుకొచ్చి అతనికిచ్చింది.

అనిల్ మౌనంగా కాఫీ తాగసాగాడు.

కవిత మెల్లగా అతని ముందు మోకాళ్ళ మీద కూర్చుని ‘‘మీరిద్దరూ పోట్లాడుకున్నారా?’’ అనడిగింది.



ఒక్కక్షణం ఆమెవైపు ఆలోచనగా చూసి అన్నాడు ''మేమిద్దరం మాట్లాడుకుని దాదాపు మూడునెలలైంది''

అవాక్కయ్యింది కవిత ఆ మాట వినేసరికి ''ఎందుకూ?'' అని వినబడనట్లుగా అడిగింది

''ప్రత్యేకించి కారణాలు పెద్దగా లేవు''

''మరి...?'' ఆశ్చర్యంగా అడిగి ''పెళ్ళయ్యి ఆర్నెల్లు కూడా కాలేదు.. ఎందుకని?''

నిట్టూర్పు విడిచి చెప్పాడు ''నీకు తెలుసుగా? నాకు సెంటిమెంట్ చాలా ఎక్కువని. ఇంటి నుంచి బయటకు వస్తూంటే మంచి శకునం ఎదురయితేనే బయల్దేరతాను. సాఫ్ట్‌వేర్ యింజనీర్‌వి ఈ రోజుల్లో కూడా యిలాంటివి నమ్ముతావా? అని తెలిసినవాళ్ళు ఎగతాళి చేస్తుంటారు. నేనూ నవ్వుకుంటాను. చదువుకి, సెంటిమెంటుకి లింకు పెడుతున్నందుకు. రోజూ పూజ చేసుకోనిదే మంచినీళ్ళు కూడా ముట్టుకోను. ఈ భక్తి, సెంటిమెంటు యిప్పటివి కావు. మా తాతగారి కాలంనుండి వచ్చినవి అలాగే మా బామ్మ, మా అమ్మ కూడా అలాగే చేసేవారు. నేను కూడా నాక్కాబోయే భార్య నా నమ్మకాల్ని గౌరవించేది అయి వుండాలని ఆశించాను.

''అందుకేగా ఎంత నీ వెంటపడ్డా చేసుకోనన్నావ్?'' నవ్వు దాచుకుంటూ అంది కవిత.

విసురుగా లేచాడు అనిల్.

''సారీ... సారీ...'' గాబరాగా అంది కవిత.

''మరేంటి? నీకు నవ్వుగా వుందేమో? నేను చాలా అప్‌సెట్ అయ్యి నీ దగ్గరకి వచ్చాను కవితా...''

నొచ్చుకుని నిజాయితీగా చెప్పింది కవిత ''నిజంగా సారీ... క్షమించు. ఏదో చిన్న సమస్య అనుకున్నాను''

''చిన్న సమస్యే. తను అంత అందంగా వుండకపోయినా, పెద్దగా చదువుకోకపోయినా, వాళ్ళ పద్ధతులు నచ్చి చేసుకున్నాను. అంతా అయిపోయిన తర్వాత తెలిసింది. తను అందమే కాదు మనసు కూడా నాకు తగ్గట్లుగా లేదని. కాపురానికి వచ్చిన రోజే చెప్పింది. తనకి దేవుడి మీద నమ్మకాలు, సెంటిమెంట్స్ లేవని.

చాలా షాక్ తిన్నాను. కాని నన్ను నేను తమాయించుకున్నాను. ఒకరకంగా వున్న విషయం నిజాయితీగా మొదట్లోనే చెప్పినందుకు అభినందించాను. మెల్లగా మార్చుకోవచ్చులే అనుకున్నాను. కాని నేను పూజ చేసుకుంటున్నా తనకి గంట శబ్దాలు అగరబత్తి పొగ పడవని తెగేసి చెప్పింది.

భూమి కంపించినట్లయ్యింది. అవమానంగా అనిపించింది. చాలా సున్నితమైన చోట దెబ్బ తగిలింది''

కళ్ళార్పకుండా అతన్నే చూస్తోంది కవిత.

''సౌమ్యంగా వుండేవాళ్ళంటే నాకిష్టం. నా భార్య కూడా అలాంటిదే అయి వుండాలని కోరుకోవడంలో తప్పు లేదుగా? మనసులో వున్న మాటను ముఖం మీదే చెప్పి, అవతలి మనిషి ఏమనుకుంటారో అనే జ్ఞానం లేకుండా, నోటికి ఎంతమాటొస్తే అంతమాట అనేసి, చాలా స్ట్రెయిట్ ఫార్వర్డ్ అనుకుంటారు చాలా మంది. అంతకన్నా దౌర్భాగ్యం యింకొకటి లేదు.

నాలో నేనే సర్దుకుని, ఆమెని మెల్లగా మార్చే బాధ్యత నామీదే వుందనిపించింది. క్రమంగా ఆమెని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాను. ఒకటి మాత్రం తెలుసుకున్నాను. ఆమె మాటల్లోనే కాదు చేతల్లో కూడా జడత్వం వుందని.

ఎప్పుడైనా మంచి రొమాంటిక్ మూడ్‌లో దగ్గరకు తీసుకుంటే, ఏదో గుర్తొచ్చినట్టు 'రేపొద్దున క్యారేజీలోకి ఏం వండమంటారు?' అనేది... అంత మొద్దుని తీసుకొచ్చి నాకు కట్టబెట్టారనిపించింది. ఒక సెన్సిటివ్ ఫీలింగ్ లేదు, ఒక మాట తీరు లేదు. కాని యింటి బాధ్యతల్ని మాత్రం అద్భుతంగా నెరవేరుస్తుంది. నాకు టైమ్‌కి ఏం కావాలో అన్ని క్షణాల్లో సమకూరుస్తుంది. ఓ డ్యూటీలా చేస్తుంది. అలా యంత్రంలా వుండటం నాకిష్టం లేదు.

ఆమెమీద కోపమో, ఆమెని మార్చలేక నామీద నాకే అసహ్యమో తెలీదు కాని, నా అలవాట్లన్నీ మర్చిపోయేను. దేవుడి గదిలో దీపం పెట్టి దాదాపు నాలుగు నెలలయ్యింది. అందుకేనేమో, నా ఉద్యోగం కూడా దినదినగండంగా తయారయ్యింది.

ఆమెని చూసి గులాబి పువ్వనుకోవాలో, దాని క్రింద వుండే ముల్లనుకోవాలో తెలియట్లేదు''

కొన్ని క్షణాలాగి మళ్ళీ అన్నాడు ''ఇదంతా నీకు చెబుతున్నందుకు నామీద నాకే అసహ్యంగా వుంది. కాని ఏం చెయ్యను?'' వ్యథాపూరితమైన కంఠంతో అన్నాడు. కవిత అతనిని అర్థం చేసుకున్నట్లు కొన్ని నిమిషాలు మౌనంగా వుండి, తర్వాత ముందుకు వంగి అతని ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని, నుదుటి మీద ముద్దు పెట్టుకుంది. అనుకోని కవిత చర్యకి నిర్ఘాంతపోయి ''కవితా... '' అన్నాడు వారిస్తున్నట్లుగా ఆమె పట్టించుకోకుండా అంది ''నువ్వు నీ పెళ్ళికి ముందే సుమతిని చూపించావు. నేనప్పుడే చెప్పాను ఆమె నీకు ఏవిధంగా కూడా సరిపోదని... కాని నువ్వు నన్ను చేసుకోలేదనే వుద్దేశ్యంతో అన్నాననుకున్నావు''

అనిల్ ఆమె రెండు చేతులని తొలగించి ''ఇప్పుడా విషయం ఎందుకు?'' అని తప్పించుకోబోయాడు.

కవిత విడవనట్లుగా అంది ''నీకు కాదు. నాకు కావాలి. నేను నిన్నెంత ప్రేమించానో నీకు తెలుసు. నన్ను పెళ్ళి చేసుకోడానికి ఎందుకభ్యంతరం చెప్పావో నాకు తెలియట్లేదు. నాకు నీ అలవాట్లు తెలుసు. నీ మనస్తత్వం తెలుసు. జీవితాంతం నీకిష్టమైనట్లే నడుచుకుంటానని చెప్పాను. అయినా నన్ను కాదన్నావు. మీ యింట్లో కూడా ఒప్పుకుని వుండకపోవచ్చు''

అనిల్ నిశ్చేష్టుడయి చూస్తున్నాడు.

''ఇప్పుడు చెప్పు?... పోనీ నువ్వయినా సంతోషంగా వున్నావా? ఇంత చదువుకుని మనకు ఏం కావాలో తెలుసుకో పోతే ఎలా? చిన్న పొరపాటు ఎంతటి అగాథం సృష్టిస్తుందో... పెళ్ళి చేసుకుని నువ్వు బాధపడుతున్నావు. నిన్ను మర్చిపోలేక నేను ఒంటరిగా వుండిపోయాను''

అనిల్‌కి ఏం చెప్పాలో తెలీక ''మరిప్పుడు... యిప్పుడు... ఏం చెయ్యాలి?'' అయోమయంగా అడిగాడు.

''జరిగింది మర్చిపో. ఆమెనలాగే వుండనివ్వు. నీ భార్య దగ్గర పొందలేనిది నా దగ్గర అందుకో'' స్థిరంగా అంది.

ఉలిక్కిపడ్డాడు అనిల్. ''ఏమిటి? ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు?''

''నువ్వు సరిగ్గానే విన్నావు. నువ్వంటే యింకా అదే పిచ్చిప్రేమతో వున్నాను. నువ్వు చెప్పు నీకు నేనంటే యిష్టంలేదా?... కేవలం నీ పెద్దల కోసమే కదా నన్ను వదులుకున్నావ్. నిన్ను ప్రేమించిన దానిగా నువ్విలా వుండటం నాకు నచ్చలేదు. మనం



# కంగనా పారితోషికం కోటి!

బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు ట్రాన్స్‌ఫర్ అయిన వారందరూ అత్యధిక పారితోషికం తీసుకోవడం సర్వ సాధారణమే! అయితే తెలుగులో వారి సినిమాలు ఒకటి రెండు హిట్ అయిన తరువాత ఒక్కసారిగా తమ పారితోషికాన్ని పెంచేస్తుంటారు. ఈసారి మాత్రం అలా జరగలేదు. తెలుగులో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న 'ఏక్ నిరంజన్' చిత్రంలో నటించడానికి బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ ఏకంగా కోటి రూపాయలు డిమాండ్ చేసిందట! బాలీవుడ్‌లో ఆమెకున్న పేరు ప్రఖ్యాతులు తెలుసు కనుక మారు మాట్లాడకుండా అంత పారితోషికాన్ని సమర్పించుకున్నాడట ఆ నిర్మాత. అదీ సంగతి!

ఏ పాపం చేశామని, నీ కోరికలని ఎందుకు చంపుకో వాలి. నేనెందుకు ఆశలు వదులుకోవాలి?''

''ఇది... ఇది... తప్పు ఆలోచన కవితా''

''ఆ తప్పు చేద్దామనే అంటున్నాను. మానసికంగా నేనెప్పుడో నీదాన్నయ్యాను. నీకు తెలీదు. నేనెంత నరకం అనుభవిస్తున్నానో... నన్ను చేసుకోలేదని సుమతిమీద యీర్ష్య కూడా లేదు. నాకు తెలిసినంతవరకు నా జీవితంలో నువ్వొక్కడివే. అందుకే నీగురించి మాత్రమే నిరంతరమైన ఆలోచన. నీ మనసుకు ఎప్పుడో దాసోహం అయ్యాను. నన్ను నీకు హృదయపూర్వకంగా అర్పించుకునే అవకాశం యివ్వు''

చేష్టలుడిగి చూస్తున్నాడు అనిల్

''ఆడదాన్ని యింతకన్నా ఎక్కువగా అడగలేను'' ఆ మాట అంటున్నప్పుడు ఆమె కంఠం రుద్ధమైంది.

అనిల్ మనసు గందరగోళంగా అయిపోయింది. స్థబ్దుగా వుండిపోయాడు. కవితని ఏవిధంగా సముదాయించాలో కూడా అర్థం కాలేదు.

చాలాసేపు అలాగే వుండిపోయి ''వస్తాను'' అని లేచాడు.

***

రాత్రి పన్నెండయ్యింది.

అనిల్‌కి ఎంతకీ నిద్ర పట్టక అస్థిమితంగా అటూ ఇటూ దొర్లసాగాడు. అతనికి పదే పదే కవిత మాటలే గుర్తొస్తున్నాయి.

నిజమే! తను ఏ పాపం చేశాడని తనకి సంతోషం కరువయ్యింది? కెరీర్ సంగతి ప్రక్కన పెడితే, కనీసం మానసికమైన తోడు కూడా లేదు. అనవసరంగా కవితని పోగొట్టుకున్నాడా?

అప్పటిదాకా టీవీ చూసి, లోపలికి వచ్చి లైటార్పి పడుకుంది సుమతి అతని ప్రక్కనే.

పడుకోగానే రెండు నిమిషాల్లో నిద్రలోకి జారుకుంది.

మెల్లగా ఆమెవైపు తిరిగి చూశాడు. బెడ్‌లైట్ కాంతిలో ప్రశాంతంగా కనబడింది సుమతి ముఖం. ఒక్కక్షణం ఆమెని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. అంత త్వరగా నిద్రలోకి వెళ్ళగలిగినందుకు.

ఒక్క క్షణమే... ఉన్నట్టుండి కోపంగా మారింది అనిల్ మొహం.

అవునులే... ఆమెకేముంటాయి ఆలోచనలు? భర్త భావాలకి గౌరవం లేదు. అతనికి ఏం చెయ్యాలో తోచలేదు. కసితో, పిచ్చెక్కిపోతున్నట్లుగా వుంది. ఏమీ పట్టించుకోనట్లు వుండే సుమతి ప్రవర్తన భరించలేకపోతున్నాడు.

ఇలాంటి సమయాల్లో ఆశ్రయించడానికి చెడు అలవాట్లు కూడా లేవు. డబ్బు వచ్చినప్పుడు అయిన అలవాట్లు, డబ్బు పోయినప్పుడు పోవు. తనకలాంటి బానిస అలవాట్లు అవనందుకు తనకు తానే అభినందించుకునేవాడు.

ఇప్పుడు కసిగా తిట్టుకున్నాడు. మళ్ళీ బెడ్‌రూం గుమ్మం దగ్గరకొచ్చి చూశాడు. మంచి నిద్రలో వుంది సుమతి.

ఆమెను చూస్తుంటే అసహనం పెరిగిపోయింది. విచక్షణ తరిగిపోతోంది. తనకిప్పుడు ఓదార్పుకావాలి. సేద తీరాలి.

అతను గబగబా ఫోన్ దగ్గరకు నడిచి, కవితకి ఫోన్ చేశాడు. ఒక్క రింగ్‌తోనే అట్నుంచి పలికింది కవిత.

''ఏమిటింకా నిద్రపోలేదా?'' ఆశ్చర్యంగా అడిగాడు అనిల్

''లేదు. సాయంత్రం నేను చాలా ఎమోషనల్‌గా మాట్లాడాను కదా! అయాం సారి'' అంది.

''కాదు... కాదు... నేనే సారీ చెప్పాలి''

''ఎందుకు?'' అడిగింది విస్మయంగా.

''నీ ప్రపోజల్‌కి ఏ సమాధానం చెప్పనందుకు''

''అంటే?''

''నువ్వు నాకు కావాలి కవిత. బోత్ మెంటల్లీ... ఫిజికల్లీ''

''నిజంగానా?'' ఎక్సయిటింగ్‌గా అడిగింది కవిత.

''ఇంత అర్థరాత్రి నీతో అబద్ధం చెప్పడానికి ఫోన్ చేయ్యలేదు''

ఆనందంగా అంది కవిత ''మరింకేం రేపొచ్చేయ్. మా యింట్లో ఎవరూ లేరుగా?''

''ఊహు''

''ఏం?''

''మనం చేసేది తప్పని తెలుసు. పెళ్ళి చేసుకుని సుమతికి, పెళ్ళి చేసుకోని నిన్ను అన్యాయం చేస్తున్నాను. ఆ అపరాధ భావంతోనే చెబుతున్నాను. నువ్వేమి అనుకోకూడదు''

''ఏమిటి?''

''ఇదే వూళ్ళో వుంటూ, తను యిక్కడే వుందనే ఫీలింగ్ నన్ను ఆ పని చెయ్యనివ్వదు''

కవిత నవ్వి ''సరే.. నీ యిష్టం ఎక్కడో చెప్పు''

కొంచెం ఆలోచించి చెప్పాడు ''రేపు సాయంత్రం ఢిల్లీకి ఫ్లయిట్ బుక్ చేద్దాం. అక్కడే రెండు మూడు రోజులు...''

వెంటనే అంది ''ఒకే. రేపు సాయంత్రం ఎయిర్ పోర్ట్‌లో కలుద్దాం. నిశ్చింతగా పడుకో అనిల్. రేపట్నుంచి మూడు రోజులూ నీవే.. అన్నీ మర్చిపోదాం... మనతో సహా.''

***

మర్నాడు ఉదయం బలవంతంగా కళ్ళు తెరిచాడు. ప్రక్కన చూస్తే... సుమతి లేదు. ఆశ్చర్యం... సుమతి తన కన్నా ముందు నిద్రనుండి లేవడం యింతవరకు చూడలేదు.

బాత్‌రూంలోంచి నీళ్ళ శబ్దం వినబడుతోంది. స్నానం చేస్తున్నట్లుంది. హాల్లో పడుకున్నాడు. రాత్రి కవితతో వేసుకున్న ప్రోగ్రాం గురించి ఆలోచిస్తున్నాడు. తనేనా... అలా మాట్లాడింది? అంటే తనలో ఏమూలో ఆమెని కోరుకుంటున్నాడు.

నీళ్ళ శబ్దం ఆగిపోయింది. సుమతి బాత్‌రూంలోంచి తల తుడుచుకుంటూ బయటకు నడిచింది.

యధాలాపంగా గడియారంవైపు చూసి ఉలిక్కిపడ్డాడు. తొమ్మిదయ్యింది. మైగాడ్! సుమతి కాదు తనే ఆలశ్యంగా నిద్ర లేచాడు.

తనలో తనే విసుక్కుంటూ పక్కమీదనుంచి లేచి బాత్‌రూంలో దూరాడు.

కాసేపటికి బయటకు వచ్చి కిచెన్ దగ్గరకొచ్చి చూశాడు. సుమతి ఏం చేస్తోందా అని. సుమతి అటువైపు తిరిగి ఏదో పని చేసుకుంటోంది. ఆమెనలా వెనకవైపునుంచి చూసి కొద్దిగా చలించాడు. 'ఈమెకి యివ్వాళ ద్రోహం చెయ్యబోతున్నాను...'

మనసంతా కొద్దిసేపు బెంగగా మూలిగింది.

అలాగే ఆమెని చూస్తూండిపోయాడు. ఇంతలో... చటుక్కున సుమతి వెనక్కి తిరిగింది. ఆమె చేతిలో కాఫీ గ్లాసుంది.

కొన్నిక్షణాలు యిద్దరి చూపులు కలుసుకున్నాయి.

సుమతి వెంటనే చూపులు మరల్చుకుని కొంచెం దూకుడుగా వచ్చి అతని చేతిలో కాఫీగ్లాసు పెట్టి వెళ్ళిపోయి తన పని చేసుకోసాగింది.

ఆమె ప్రవర్తనకి ఛర్రున కోపం వచ్చింది. ఆ నిర్లక్ష్యమే తనకిష్టముండదు. కాస్త ప్రేమగా అందిస్తే ఏం పోతుంది?

ఇవతలకి వచ్చేశాడు. ఇందాక లిప్తకాలంపాటు కలిగిన సానుకూల దృక్పధం పోయి కోపంతో ముఖం జేవురించింది.

'ఛ... తను తీసుకున్న నిర్ణయమే కరెక్ట్. ఆమెని మోసం చేస్తేనేగాని తన అహం చల్లారదు.'

ముందు ఆఫీసుకి ఫోన్ చేసి తను శెలవు పెడుతున్నట్టు మెసేజ్ పంపించాడు. తను వచ్చేసరికి ఉద్యోగం వుంటుందా వూడుతుందా?

పోతే పోయింది. ఏం తనకి టాలెంట్ లేదా? మళ్ళీ సంపాదించుకోలేనా? ఇలా ప్రతీది సెన్సిటివ్‌గా ఆలోచించబట్టే, చాలా కోల్పోవాల్సి వస్తోంది జీవితంలో అనుకున్నాడు పౌరుషంగా.

ట్రావెల్స్‌కి ఫోన్ చేసి ఢిల్లీకి టికెట్స్ బుక్ చేశాడు.



తర్వాత వార్డ్‌రోబ్‌లోంచి సూట్‌కేసు తీసి అయిదారు జతల బట్టలు యింకా కావాల్సినవి సర్దుకున్నాడు.

సుమతి ఒకసారి తొంగి చూసి, తర్వాత ఎవరికో ఫోన్ చేసి మాట్లాడసాగింది. సర్దడం అయ్యింతర్వాత స్నానం చెయ్యడానికి వెళ్ళాడు.

దాదాపు అరగంట తర్వాత బయటకు వచ్చి బట్టలు వేసుకుని టైమ్ చూశాడు. పదకొండున్నర.. కవిత ఏం చేస్తుంటుందోనని సెల్‌ఫోన్ తీసి నెంబర్ డయల్ చెయ్యబోయాడు.

కాలింగ్‌బెల్ మ్రోగింది.

అనిల్ వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా కవిత నిలబడి వుంది. ఆమె ముఖం భావరహితంగా వుంది. నమ్మలేనట్లు చూశాడు.

కవిత నవ్వడానికి ప్రయత్నించింది. అనిల్ కంగారు బయటకు వచ్చి "ఎయిర్‌పోర్టులో కదా మనం కలుద్దామనుకున్నాం సరాసరి యింటికొచ్చేశావేమిటి?"

"ఇందాక మీ ఆవిడ ఫోన్ చేసి రమ్మంది"

"ఎందుకు?" గుండె వేగంగా కొట్టుకుంటూం డగా అడిగాడు.

"నాకేం తెలుసు? ఫోన్ చేసి నీతో పనుంది యింటికి రమ్మంది. నాకేం అర్థం కాలేదు. సరే మనం సాయంత్రం కదా వెళ్ళాల్సింది అని వచ్చాను"

అతనికి ఆదుర్దా పెరిగిపోయింది. 'ఎందుకు రమ్మందంటావ్?' అడిగాడు రహస్యంగా.

"సుమతి ఫోన్ చేసిన దగ్గర్నుంచీ నాకూ అదే టెన్షన్. బహుశా రాత్రి నువ్వు నాతో మాట్లాడుతుంటే వినుంటుందంటావా?"

గెడ్డంమీద రాసుకుంటూ "అలాంటిదేమిలేదే? ఆ టైమ్‌లో తను మంచి నిద్రలో వుంది"

"ఏమో మొత్తానికి మనమీద అనుమానం వచ్చుంటుంది. లేకపోతే తనంతట తాను నాకెప్పుడూ ఫోన్ చెయ్యలేదు. పైగా యింత సడన్‌గా... మనం ప్రోగ్రాం పెట్టుకున్నప్పుడే" పాలిపోయింది అనిల్ మొహం. గొణుక్కున్నట్లుగా అన్నాడు.

"అందుకేనేమో తనివ్వాళ టిఫిన్ తినలేదు కనీసం కాఫీ కూడా తాగలేదు" అని నుదురు కొట్టుకుంటూ "నువ్వు రాకుండా ఏదో కారణంతో తప్పించుకోవాల్సింది"

కవిత ఏదో చెప్పేలోగా కిచెన్‌లోంచి బయటకు వచ్చింది సుమతి.

ఇద్దరూ బెంగగా చూడసాగారు.

సుమతి ఇద్దర్ని మార్చి మార్చి చూసి కవితని ఉద్దేశించి "అదేమిటి అలా బయటే వుండిపోయావు. లోపలికి రా కవితా..." అంది

కవిత లోపలికి వచ్చి కూర్చుంది. అనిల్ కవితని కళ్ళతోనే జాగ్రత్త అని హెచ్చరించి సెల్‌ఫోన్ మ్రోగితే మాట్లాడుకుంటూ లోపలికెళ్ళాడు.

సుమతి ఆ రోజు న్యూస్ పేపరు తెచ్చి, కవితకిచ్చి "చదువుకుంటూ వుండు పైకెళ్ళి బట్టలారేసివస్తాను. ఇక్కడ సౌకర్యంగా లేదు" అని బయటకు వెళ్ళింది.

కవిత పేపరు చూస్తోందేకాని, ఆమె మనసు పరి విధాలుగా ఆలోచిస్తోంది. ఆమెలో అనేక ప్రశ్నలు. స్థిరంగా కూర్చోలేకపోయింది.

ఫోన్‌లో మాట్లాడి వచ్చి సుమతి లేదని తెలుసుకుని గబగబా కవిత దగ్గరకొచ్చి "ఏమైనా చెప్పిందా?" అనడిగాడు.

లేదన్నట్టు తలవూపి "ఆలోచిస్తే... ఒకటనిపిస్తోంది" అంది కవిత.

"ఏమని?"

"తను ఏమడగబోతోందోనని ముందుగానే టెన్షన్ పడ్డం ఎందుకు? ఒకవేళ మన ప్రోగాం గురించి తెలిసినా, అదీ మన మంచికే అనుకుంటున్నా" కవిత గొంతులో యిందాకటి కంగారు లేదు.

"సరిగ్గా చెప్పు?"

"మన విషయం గురించే పిలిచిందనుకుదాం. సమస్య వీడిపోయినట్లే కదా?

విషయం తేలిపోతుంది. ఎవరి మనస్సుల్లో అశాంతి వుండదు. ఏమంటావు?"

పైన బట్టలారేసి క్రిందకు వచ్చింది సుమతి. లోపలికి రాగానే "ఆకలేస్తోందా?" అని కవితని అడిగింది.

ఏదో ఆలోచిస్తున్న కవిత అనాలోచితంగా 'అవునని' తల వూపింది.

"అయితే రండి పెట్టేస్తాను" అని లోపలికి వెళ్ళింది.

సుమతి వెళ్ళిన వైపే చూస్తూ "పోనీ నువ్వే తనని ఎందుకు పిలిచిందో అడగవచ్చుగా?"

"అనవసరంగా తొందరపడ్డం ఎందుకు? ఆ ప్రసక్తే వచ్చిందనుకో నిర్ణయం కూడా ఆమెనే అడిగేద్దాం" కూల్‌గా అంది కవిత.

సుమతి డైనింగ్ టేబుల్ దగ్గర అన్నీ సర్ది "భోజనానికి రండి" యిద్దర్నీ ఉద్దేశించి అంది.

ఇద్దరూ లేచారు. డైనింగ్ టేబుల్ మీద రెండు ప్లేట్లే చూసి "నువ్వు తినవా?" అడిగింది కవిత సుమతిని.

"మీరు తినండి" ముక్తసరిగా అనేసి వెళ్ళిపోయింది.

"చూశావా? మ్యాటర్ సీరియస్‌గా ఉండేటట్టు వుంది" అంది కవిత.

అనిల్ ముఖం వివర్ణమైపోయింది. అక్కడ కూర్చోలేక భోజనం త్వరగా ముగించి లేచి గదిలో కెళ్ళి తలుపేసుకున్నాడు. మనసు అస్తవ్యస్తంగా తయారయింది.

అతను యింట్లో గంభీరమైన వాతావరణాన్ని తట్టుకోలేకపోతున్నాడు. ఎంత త్వరగా సాయంత్ర మౌతుందా అని వుంది.

అంత ఆందోళనలో కూడా అతనిమీద అతనికే ఆశ్చర్యమేసింది. తను దేనిగురించి తప్పించుకుందా మనుకుంటున్నాడు? కవిత మీద కలిగిన వ్యామోహం కోసమా? లేదా భార్య పట్ల విముఖతతోనా?

రేపాటికి కవిత కౌగిలిలో స్వాంతన పొందుతూ... తన భార్యగురించి బాధపడుతూ... ఎంత హీనమైన పరిస్థితి. తనమీద తనకే వికారం కలిగింది.

ముందు బయట ఏం జరుగుతోందో....

టేబుల్‌మీద వున్న పదార్థాలని సర్దడానికి వచ్చింది సుమతి.

చేతులు కడుక్కుంటూ అడిగింది సుమతిని "ఇంతకీ నన్నెందుకు రమ్మన్నావో చెప్పలేదు."

ఆమె అడిగిన దానికి సమాధానం చెప్పకుండా "ఆయనకివ్వాళ ఆఫీసు లేదా? బట్టలు సర్దుకున్నారు. ఊరు వెళ్తారు కాబోలు" అంది సుమతి

తడబడింది కవిత "ఊరు... వెళ్తాడా... నాకు తెలీదే" చిన్నగా అంది

"ఆయన వుండరేమో నీతో మాట్లాడదామనుకున్నాను" చిన్నగా అంది.

అదీసంగతి...

"ఇప్పుడే వస్తాను" అని బయట కారిడార్‌లోకి వచ్చి సెల్ తీసుకుని అనిల్‌కి ఫోన్ చేసింది.

"చెప్పు ఎక్కడ్నుంచి" ఆత్రుతగా అడిగాడు.

"ఇక్కడ్నుంచేలేగాని, నువ్వు ప్రొద్దుట్నుంచి యింట్లోనే వున్నావు. అందుకే మాట్లాడలేకపోతోంది"

"అని చెప్పిందా?"

"ఉ.... నువ్వు బయటకు వెడితే, విషయం బయటకు వస్తుంది"

"నేనెక్కడికి వెళ్ళాలి?" అని అడిగాడు.

"ఓ గంట ఎక్కడికయినా వెళ్ళు. ఈలోపు నేను మాట్లాడి నీకు ఫోన్ చేస్తాను"


"ఓ.కే. త్వరగా చెయ్యి. జాగ్రత్త టైమ్ అవుతోంది. మనం ఒక గంట ముందే ఎయిర్‌పోర్టులో వుండాలి" అన్నాడు.

"సరే.. సరే నేను చెప్పేదాకా రాకు" అని సెల్ ఆఫ్ చేసి లోపలికి నడిచింది.

అరగంట తర్వాత అనిల్ పనున్నట్లు బయటికి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు మనిద్దరమే వున్నాం సుమతి. నాతో ఏం మాట్లాడాలి" మనసులో ఉద్విగ్నతను బయట పడకుండా శాంతంగా అడిగింది.

సుమతి ఏం మాట్లాడకుండా కవితని బెడ్‌రూంలోకి



తీసుకెళ్ళి బీరువాలోంచి ఒక ప్యాకెట్ బయటకు తీసింది.

కవిత ఆత్రుతగా చూస్తోంది.

ప్యాకెట్‌లోంచి చీర బయటకు తీసి "ఎలా వుంది?" అనడిగింది సుమతి.

పరీక్షగా చూసి "బావుంది" అంది

"నీకే యిది. సాయంత్రం నువ్వు స్నానం చేసి యీ చీర కట్టుకోవాలి"

"ఎందుకు?" వూపిరి ఆగిపోయినట్లుగా అడిగింది.

"ఎందుకంటే... నేనివ్వాళ వైభవ లక్ష్మీవ్రతం చేసుకుందామనుకుంటున్నాను"

ఏదో వూహించుకుని, ఏదో వినేసరికి అర్థం కాలేదు కవితకి "వ్రతమా? నువ్వా?"

"అవును"

"మరి నీకిలాంటి పూజల మీదా, వ్రతాల మీదా నమ్మకం లేదని అనిల్ చెప్పాడే" మెల్లగా అంది సుమతి

"నిజమే... కాని నేను మారాను"

కవిత ఊహించని సన్నివేశం చూస్తున్నట్టు, శిలలా నిలబడిపోయింది.

సుమతి చెప్పసాగింది "మాది సదాచార సంపన్న కుటుంబం కవిత. అంటే ఆర్థడాక్స్ ఫ్యామిలీ. పూజలకి, ఆచారవ్యవహారాలకి సాంప్రదాయాలకి విలువ నిచ్చేవారు మా నాన్నగారు. మేము కూడా అలాగే పెరిగాం. చాలా నియమనిష్టలతో వుండే వాళ్ళం. కాని, యివేవీ మా అక్కను కాపాడలేకపోయాయి. తనకి పెళ్ళయిన ఏడాదికే అంతుపట్టని కారణంతో మా అక్క చనిపోయింది. తనకి ఆరోగ్యం దెబ్బతిని పోయిందో, లేక వాళ్ళింట్లో కలహాల వల్ల పోయిందో సరిగ్గా చెప్పలేదు మా బావగారు. ఏదయినా తను చనిపోయింది. ఆమె మరణం చాలా కృంగదీసింది నన్ను. చాలాకాలం కోలుకోలేదు. అంత యిష్టం మా అక్కయ్యంటే.

అప్పట్నుండి చిత్రంగా నాలో చాలా మార్పు. ఆ పూజలు, అర్థంలేని వుపవాసాలు, ఈ పురాతన భావాలు అర్థంలేనివనిపించాయి. అన్నిటిమీదా నమ్మకం పోయింది. ముఖ్యంగా మగవాడిమీద. ఇతిమిత్థంగా చెప్పలేనుగాని, అక్క మరణానికి ఆమె భర్తే కారణమని నమ్ముకుంటూ వచ్చాను. పెళ్ళనేది చేసుకోకూడదని అనుకున్నాను. కాని నా తర్వాత చెల్లెళ్ళున్నారు. వాళ్ళ భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని పెళ్ళికి ఒప్పుకున్నాను"

కాని, పెళ్ళయిన మొదటిరోజే తెలిసింది. నా భర్తకి కూడా యిలాంటి నమ్మకాలు ఎక్కువని. వాటికి ఎక్కువ ప్రాధాన్యం యిస్తారని తెలిసి షాకయ్యాను. అసలే అక్కయ్య విషయంలో మొద్దుబారిపోయింది రాటుదేలిపోయింది నా హృదయం. నా మాటకు విలువలేదు మా యింట్లో. మళ్ళీ యిక్కడ కూడా అదే పరిస్థితని తెలిసి జీర్ణించుకోలేకపోయాను. ఆ కసితోనే ఆయనకు కఠినంగా చెప్పాల్సి వచ్చింది. జడత్వంతో నొప్పించాల్సి వచ్చింది."

విభ్రమంగా చూస్తోంది కవిత. సుమతిలో కొత్త మనిషిని చూడసాగింది.

"మా పెళ్ళయిన వెంటనే అమెరికా వెళ్ళిన మా అత్తగారు మామగారు పదిరోజుల క్రితం యిండియాకి వచ్చారు. ఆయనికి ఫోన్ చేశారు. మమ్మల్ని చూడ్డానికి వస్తామన్నారు. అప్పుడు నా భర్త ఆవిడ వస్తే మా మధ్యవున్న ప్రేమరహిత సంసారాన్ని చూసి ఆవిడ తట్టుకోలేరని 'మేము చాలా హ్యాపీగా వున్నాం. దయచేసి కొన్నాళ్ళపాటు ఎవరూ వచ్చి డిస్టర్బ్ చేయొద్దని' అన్నారు.

ఆ మాట నన్ను నిలువునా కుదిపేసింది. నా కళ్ళు తెరిపించాయి. నామీద నాకే అసహ్యం వేసింది. ఆయనకి తల్లంటే ప్రాణం. అలాంటిది ఆయనే తల్లిని రావద్దని చెప్పడానికి ఎంత క్షోభ పడ్డారో తెలిసింది. నా భర్త ఎంతటి సహృదయుడో అర్థమైంది.

నా మనస్తత్వానికే ప్రాధాన్యం యిచ్చి, నా వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటున్నానని అనుకున్నాను గాని, ఇంటి యజమానిగా, అనేక సమస్యలతో వున్నా నాకు ఏ లోటూ లేకుండా జీవితాన్ని నడుపుతున్న ఆయన నమ్మకాన్ని, మనసుని గాయపెట్టినట్లుగా తెలుసుకోలేకపోయాను. చిన్న సమస్య.. నేనే పిచ్చి పట్టుదలతో జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకుంటున్నానిపించింది. అందుకే

"నిజమే.. నీమీద ఆశతో నేను, అసంతృప్తితో నువ్వు తప్పు చేద్దామనుకున్నాం. సుమతిని మొద్దు అనుకున్నాం కాని ఏమాత్రం కల్మషం లేని మంచుముద్ద. మంచుతో కప్పబడిన దేవత. ఆ మంచు కరిగించింది నువ్వేనని అంటోంది. ఆమె అమాయకత్వం నన్ను కట్టేసింది. అంతటి స్వచ్ఛమైన మనసు ముందు తనకి ద్రోహం చెయ్యాలనే ఆలోచనతో, ప్రక్కనే వుండి నవ్వుతూ వంచించలేను. అందుకే పారిపోయి వచ్చాను..."

నేను మారాలనుకున్నాను. ఆయన ఉద్యోగరీత్యా కూడా అశాంతిగా వున్నారు. ఆయన సెంటిమెంట్సుకి, యిష్టానికి విలువనిచ్చి ఈ వైభవలక్ష్మీ వ్రతం చేద్దామనుకుంటున్నాను. ఇది మాకు, ఆయన వృత్తికి మంచిదని చేస్తున్నాను. ఆయన ముందు మారానని చెప్పాలంటే మొహమాటపడ్డాను. ఎంతయినా నాకూ కొంచెం అహం వుటుందిగా" అని నవ్వింది సుమతి

మళ్ళీ అంది "తర్వాత ఎలాగూ తెలుస్తుందనుకో" ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి.

నోటమాట రానట్లు వుండిపోయింది కవిత. నిరుత్తరురాలయి చూసింది "మరి.. మరి... నన్నెందుకు పిలిచావు?" ... బలహీనంగా ఆమె గొంతు.. సుమతి చెప్పింది ఈ వ్రతానికి ముత్తయిదువులతోపాటు, కన్నె ముత్తయిదువులకి కూడా వాయనం యిస్తే మంచిది. నువ్వు తప్ప ఈ వూరిలో నాకు తెలిసిన వాళెవరున్నారు చెప్పు?.. "ఇలా వస్తే నీకు మంచి జరుగుతుంది. నీ ఉద్యోగం కూడా స్థిరంగా వుంటుంది. నీక్కూడా త్వరలో పెళ్ళవుతుందని నా నమ్మకం"

తలవంగిపోయింది కవితకి న్యూనతాభావంతో. సూటిగా ఆమె కళ్ళల్లోకి చూడలేకపోయింది.

"కాని... కాని..." ఆ మాట పూర్తి చెయ్యలేకపోయింది.

మధ్యలో ఆపి అంది సుమతి "నువ్వేం చెబుదామనుకుంటున్నావో అర్థమైంది. నేను మనిషిలో మంచితనాన్ని చూస్తాను కవిత. అలా చూస్తేనే ఏ దేవుడయినా యిష్టపడతాడు"

ఆ మాటకు చిగురుటాకులా వణికిపోయింది. సుమతిని గట్టిగా పట్టుకుని ఏడ్చేసింది.

సుమతి ఆమె వీపు నిమిరింది ఓదార్పుగా

కొంతసేపాగిన తర్వాత తన కర్తవ్యం గుర్తొచ్చింది కవితకి. రూమ్‌లోంచి బయటకు వచ్చి అనిల్‌కి ఫోన్ చేసింది.

వెంటనే రిసీవ్ చేసుకున్నాడు అనిల్ "ఆ... చెప్పు ఏమైంది?" అదురుతున్న కంఠంతో అన్నాడు.

"ఎక్కడున్నావు నువ్వు?" అడిగింది కవిత.

"ఏం ? రెస్టారెంట్‌లో" తనెక్కడున్నాడో చెప్పాడు.

"వస్తున్నాను" అని సెల్ ఆఫ్ చేసింది.

నరాలు చిట్లేంత టెన్షన్ పట్టుకుంది అనిల్‌కి ఆమె వచ్చేవరకు. పది నిమిషాల్లో వచ్చి అతని ముందు కూర్చుంది కవిత.

"త్వరగా చెప్పు ఏమైంది?" వాడిపోయిన ఆమె ముఖాన్ని చూసి ఆందోళనగా అడిగాడు.

చెప్పింది కవిత. చెబుతున్నంతసేపు తనకి తానే చెప్పుకుంటున్నట్లుగా చెప్పింది. అంతా విన్న అనిల్ ముఖంలో నెత్తురు చుక్కలేదు. "నిజమా.. నిజమా" అని గొణిగాడు. కవిత అంది "నిజమే.. నీమీద ఆశతో నేను, అసంతృప్తితో నువ్వు తప్పు చేద్దామనుకున్నాం. సుమతిని మొద్దు అనుకున్నాం కాని ఏమాత్రం కల్మషం లేని మంచుముద్ద. మంచుతో కప్పబడిన దేవత. ఆ మంచు కరిగించింది నువ్వేనని అంటోంది. ఆమె అమాయకత్వం నన్ను కట్టేసింది. అంతటి స్వచ్ఛమైన మనసు ముందు తనకి ద్రోహం చెయ్యాలనే ఆలోచనతో, ప్రక్కనే వుండి నవ్వుతూ వంచించలేను. అందుకే పారిపోయి వచ్చాను..." అని ఆగి "మనం చాలా పెద్ద తప్పు ఆలోచన చేశాం అనిల్" అంది.

స్థాణువైపోయాడు అనిల్. తర్వాత తెప్పిరిల్లి "నేను వెంటనే సుమతిని చూడాలి" అని లేచాడు.

***

అనిల్ యింటి కొచ్చేసరికి అప్పుడే మిగతా ఫ్లాట్స్‌లో వున్న కొంతమంది ముత్తయిదువుల్ని వ్రతానికి పిలిచి లోపలికి వచ్చింది.

వడివడిగా కొట్టుకుంటున్న గుండెతో ఆమె ఎదురుగా నిలబడ్డాడు.

కళ్ళతోనే ఏమిటన్నట్లు చూసింది సుమతి.

తప్పు చేద్దామనుకుని, ఆ తప్పు చెయ్యనివ్వక, తనకు తెలియకుండానే తప్పించిన భార్య పట్ల కృతజ్ఞతతో అప్రయత్నంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు అనిల్.

★

**చిరునామా**
**కొమ్మూరి రవికిరణ్**
**సన్ ఆఫ్ కొమ్మూరి వేణుగోపాలరావు**
**26-26-22, నాగేశ్వరరావు పంతులు రోడ్,**
**గాంధీనగర్, విజయవాడ - 520 003**
**మొబైల్ : 9392104204**